


వేంకటేశ్వరునికి సహస్ర ఫలార్చన

వినుకొండ: స్థానిక శ్రీనివాసనగర్‌లోని వేంటే శ్వరస్వామి ఆలయంలో సోమవారం జ్యేష్ట త్రయోదశి కృత్తికా నక్షత్రం సందర్భంగా సహస్ర ఫల పదార్చన వైభవంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 514.30 అడుగుల వద్ద ఉంది. ఇది 139.0872 టీఎంసీలకు సమానం.



అమ్మ వారి హుండీ కానుకల లెక్కింపు

దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి హుండీ కానుకలు సోమవారం లెక్కించారు. మొత్తం రూ. 20,67,441 ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

కాలువల మరమ్మతులకు చర్యలు తీసుకోండి



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): జిల్లాలో సాగు నీటి కాలువలు మురుగు నీటి మయమై ప్రజారోగ్యానికి ముప్పుగా మారాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. పశ్చిమ కృష్ణా డెల్టా ఆయకట్టు సుమారు 5.71 లక్షల ఎకరాల్లో విస్తరించి ఉందని తెలిపారు. కాలువలు సక్రమంగా లేకపోవడంతో ఆయకట్టు రైతులంతా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి సాగు నీటి కాలువల పరిస్థితి నిదర్శనమని విమర్శించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య ,ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.వి.జగన్నాథం, అధ్యక్షులు కంజుల విఠల్ రెడ్డి, నాయకులు పాపారావు, రైతులు పాల్గొన్నారు.

హైవేలపై ప్రమాదాల నివారణకు ఆధునిక వాహనాలు

ఆర్టీఓ బి. సత్యనారాయణ ప్రసాద్



పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): జాతీయ రహదారులపై ప్రమాదాలను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం ఆధునిక వాహనాలను ప్రవేశ పెట్టినట్లు ఆర్టీఓ బి.సత్యనారాయణ ప్రసాద్ తెలిపారు. గుంటూరులోని కార్యాలయంలో సోమవారం నంది ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు పెట్రోలింగ్ ఆధునిక వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన ఈ వాహనాలు 5, 9 నంబర్ల జాతీయ రహదారులపై నిత్యం అందుబాటులో ఉంటాయని చెప్పారు. నంది ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ ఎండీ, విశ్రాంత అడిషనల్ ఎస్పీ కాళహస్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ముందుగా బ్రిడ్జి మీదకు బస్సులు, లారీలు, ఇతర భారీ వాహనాలు రాకుండా డైవర్ట్ చేశారు. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను మాత్రమే అనుమతించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా లాడ్జి సెంటర్ వద్ద, డొంక రోడ్డు నుంచి కొత్తపేట వైపు వెళ్లేటప్పుడు మలుపుల వద్ద డివైడర్లు ఏర్పాటు చేశారు.

నాట్యంపై రాత పరీక్షలు ప్రారంభం



కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి కళాపీఠంలో మూడు రోజుల పాటు సాగే కూచిపూడి నాట్య సర్టిఫికెట్, డిప్లొమా రాత పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు పరిశీలకులుగా హైదరాబాద్ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డి. వెంకట సత్యనారాయణ, ఇన్విజిలేటర్లుగా పసుమర్తి హరినాథశాస్త్రి, ఏలేశ్వరపు శ్రీనివాసులు వ్యవహరిస్తున్నారు. తొలి రోజు పరీక్షకు 37 మంది విద్యార్థులకు 31 మంది హాజరయ్యారని ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ తెలిపారు.



గుంటూరులో యువతను అడ్డుకుంటున్న పోలీసులు



'యువత పోరు'తో జిల్లా కేంద్రం హోరెత్తింది. ఎన్నికల సమయంలో ఎన్నో ఆశలు రేపి, హామీలు గుప్పించి ఓట్లు దండుకున్న కూటమి ప్రభుత్వ కపట నాటకంపై యువత విరుచుకు పడింది. ఇచ్చిన హామీలను పక్కనబెట్టి , రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన చేస్తోందని కన్నెర్ర జేసింది. 20 లక్షల ఉద్యోగాలు ఏవీ ? అంటూ సూటిగా గొంతెత్తి నినదించింది. నిరుద్యోగ భృతి కూడా ఇవ్వకుండా నీరుగార్చారని నిప్పులు చెరిగింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద యువత పోరు కార్యక్రమం జరిగింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని యువత డిమాండ్ చేసింది. పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, జోనల్ అధ్యక్షుడు కళ్లం హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. – పట్నంబజారు (గుంటూరు ఈస్ట్)

'యువత పోరు' హోరు

- ఎగసిపడ్డ యువ కెరటాలు
- గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చిన యువత
- అధికారులకు వినతిపత్రం అందజేత



యువత పోరు ర్యాలీలో నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఉత్తేజ్‌రెడ్డి, యువత, విద్యార్థులు

మోసం బాబు సహజ లక్షణం

ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ చంద్రబాబుకు మోసం చేయడం పుట్టుకతో వచ్చిన సహజ లక్షణమని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో లేనిపోని హామీలనిచ్చి యువత భవిష్యత్తును నట్టేట ముంచారని మండిపడ్డారు. ఏడాది కాలంలో ప్రతి ఒక్క యువతి, యువకుడికి చంద్రబాబు రూ. 36వేలు బకాయి పడ్డారని, అవి ఎప్పుడు ఇస్తారో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. ఇరవై లక్షల ఉద్యోగాలు అని చెప్పి, కనీసం ఒక్క ఉద్యోగమైనా ఇవ్వలేదని మండిపడ్డారు. జాబ్ క్యాలండర్ అతీగతీ లేకుండా పోయిందని ఫాతిమా విమర్శించారు.

ఉద్యోగాలు ఊడపీకిన బాబు

పార్టీ యువజన విభాగం రాష్ట్ర జోనల్ అధ్యక్షుడు కళ్లం హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో లక్షన్నర ఉద్యోగాలు ఇచ్చిన ఘనత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. అందులో పావు వంతైనా ఇచ్చిన పాపాన చంద్రబాబు పోలేదని మండిపడ్డారు. 20లక్షల ఉద్యోగాల సంగతి పక్కన బెడితే వలంటీర్లు మొదలుకుని నాలుగు లక్షలకు పైగా ఉద్యోగాలు ఊడపీకారని దుయ్యబట్టారు. 100 రోజుల్లో నిరుద్యోగ భృతి ఇస్తామన్న లోకేష్ 400 రోజులు అయినా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.

యువత కోసం పోరాటాలకు సిద్ధం

పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి మాట్లాడుతూ హామీలను నెరవేర్చలేని చంద్రబాబు ఏ మొఖం పెట్టుకుని ప్రజల్లోకి వస్తున్నారన్నారు. ఫీజురీయింబర్స్ బకాయిలు, వసతిదీవెన, యువతకు నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు.. అన్నీ ఎగ్గొట్టారని విమర్శించారు. డబ్బులు లేవంటూ అన్ని వర్గాల ప్రజలను నిలువునా వంచించారన్నారు. వైఎస్ జగన్ నేతృత్వంలో యువత కోసం పోరాటాలకు తాము సిద్ధమన్నారు. ఇవ్వాల్సిన హామీలు ఇవ్వకుండా, ఇదేమని ప్రశ్నిస్తే.. అక్రమ కేసులు పెడుతున్నారని, వీటిపై యువత తిరబడే రోజుల దగ్గర్లోనే ఉన్నాయని ఉత్తేజ్‌రెడ్డి హెచ్చరించారు.

పోలీసు జులుంపై ఆగ్రహం



కలెక్టర్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న నేతలు

వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన వేణు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్, సోషల్‌మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు కొరిటిపాటి ప్రేమ్ కుమార్, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు దానం వినోద్, క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ల విజయ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ మాట్లాడారు. అనంతరం నిరసన సభ దగ్గర నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శనగా పార్టీ, యువజన, విద్యార్థి విభాగం నేతలు ముందుకు సాగారు. కలెక్టర్ లోపలికి వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకోవటంతో వైఎస్సార్ సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నామని, సహకరించాలని కోరడంతో పది మంది ముఖ్యనేతలను వినతిపత్రం అందజేసేందుకు అనుమతించారు. తొలుత తూర్పు నియోజకవర్గ నుంచి పార్టీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా ద్విచక్ర వాహనాలు ర్యాలీతో కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నందేటి రాజేష్, శేషగిరి పవన్, మేరి కుమారి, జగదీష్, పేటేటి బాజీ, యువజన విభాగం నేతలు మహ్మద్ గౌస్, పులగం సందీప్‌రెడ్డి, కోటిరెడ్డి, చుండు వెంకటరెడ్డి, గౌతమ్, సాంబశివరావు, కొండమడుగుల గోపిరెడ్డి, ఈదా యశ్వంత్‌రెడ్డి, సూరజ్, వంగా సీతారామిరెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, పలు అనుబంధ విభాగాల అధ్యక్షులు, నగర, జిల్లా కమిటీ నేతలు పాల్గొన్నారు.

వృద్ధురాళ్ల హత్య కేసులో నిందితుల అరెస్ట్

- మైనర్ సహా ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ఇదే ముఠా గత నెలలో మరో మహిళను హత్య చేసినట్టు దర్యాప్తులో వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు, పక్కన సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ కరీముల్లా

తెనాలి రూరల్: స్థానికంగా సంచలనం రేకెత్తించిన వితంతు వియ్యపురాళ్ల జంట హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో ఓ మహిళ, యువకుడు, మైనర్ బాలుడు ఉండటం విశేషం. స్థానిక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎస్.రమేష్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ బి.జనార్దనరావు వివరాలను వెల్లడించారు. పరిమి రోడ్డులో నివసించే దాసరి రాజేశ్వరి(59), పీటా అంజమ్మ(70) ఈనెల 19న దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. మృతుల సమీప బంధువు మోర్ల రాజారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. మారీసుపేటకు చెందిన అత్తోట కుసుమకుమారి, పరిమి రోడ్డుకు చెందిన ఇళ్ల గోపీకృష్ణ, చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ షేక్ అబ్దుల్ కలాం(మైనర్)ను పోలీసులు అరెస్టు చేశారు. మృతురాలు రాజేశ్వరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె చెన్నైలో ఉండగా కుమారుడు అమెరికాలో స్థిరపడ్డాడు. రాజేశ్వరి భర్త నాలుగు సంవత్సరాల కిందట మృతి చెందాడు. ఆమె వియ్యపురాలు పీటా అంజమ్మ భర్త కూడా రెండేళ్ల కిందట మృతి చెందాడు. అంజమ్మ, రాజేశ్వరి వియ్యపురాళ్లు కావడంతో ఇద్దరు పరిమి రోడ్డులోనే కలిసి ఉంటున్నారు. వృద్ధుల ఆలనా పాలన సమీప బంధువు వీరేష్‌బాబు చూస్తున్నాడు. మహిళలు ఇద్దరు డాబా పై భాగంలో ఉంటున్నారు. కింది భాగంలో నాలుగు గదులు, గతంలో అప్పడాల ఫ్యాక్టరీ నిర్వహించిన ప్రాంతం ఖాళీగా ఉంది. దానిని అద్దెకిచ్చేందుకు బోర్డు పెట్టారు. మృతులు ఉంటున్న ఇంటికి సీసీ కెమెరాలు అమర్చిన రాజేశ్వరి కుమార్తె ధనలక్ష్మి చెన్నైలో ఉంటూ పర్యవేక్షిస్తున్నారు.

ఇంటిని అద్దెకు తీసుకునే నెపంతో..

మృతుల వద్ద బంగారం, నగదు ఉందన్న విషయాన్ని గుర్తించిన నిందితులు వారిని హతమార్చి, అపహరించాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం ఈ నెల 19న మధ్యాహ్నం వచ్చి ఇంటిని అద్దెకు తీసుకునే నెపంతో మాటలు కలిపారు. లోపలకు చొరబడి తూకం రాయితో దాడి చేసి రాజేశ్వరిని హతమార్చారు. వియ్యపురాలు కిందకు వెళ్లి చాలాసేపటికి పైకి రాకపోవడంతో అంజమ్మ పైనుంచి కేకలు వేసింది. ఆమెను రాజేశ్వరి పిలుస్తోందని రమ్మని కుసుమకుమారి చెప్పడంతో కిందకు వచ్చిన ఆమె గొంతుకు టవల్ బిగించి హతమార్చారు. రాజేశ్వరి మెడలో ఉన్న బంగారపు నాంతాడు, అంజమ్మ చేతులకు ఉన్న నకిలీ గాజులను అపహరించారు. మృతుల్లో ఒకరి చేతిలో కర్రను, మరొకరి చేతిలో తూకం రాయిని ఉంచి, ఇద్దరూ పరస్పరం ఘర్షణ పడడంతో మృతి చెందారన్న భ్రమ కల్పించే ప్రయత్నం చేసి ఉడాయించారు.

సమీప బంధువులకు కూతురు సమాచారం

చెన్నైలో ఉన్న రాజేశ్వరి కుమార్తె ఫోన్ చేసినా ఇద్దరూ స్పందించకపోవడడం, సీసీ కెమెరా పుటేజ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి వెళ్లిన ఆనవాళ్లు కనిపించడంతో కంగారు పడిన ఆమె, సమీప బంధువులైన వీరేష్, రాజారావును ఇంటికి వెళ్లి చూడాలని కోరింది. వారు వచ్చి చూడగా రాజేశ్వరి, అంజమ్మ రక్తపు మడుగులో మృతి చెంది ఉన్నారు. విషయాన్ని వెంటనే వారు పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల పుటేజ్ ఆధారంగా నిందితులను అదుపులో తీసుకొని ప్రశ్నించగా నేరం అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులు అపహరించిన బంగారాన్ని తాకట్టు పెట్టి లక్ష రూపాయలు తీసుకొని వాటిలో కొంత నగదును ఖర్చు చేశారని, మిగిలిన రూ.34,500ను, నాంతాడు, నకిలీ గాజులను, వారు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కాగా ఈ కేసులో నిందితురాలైన మహిళ కుసుమకుమారి గోపీకృష్ణ, కలాంలతో కలసి గత నెలలో కూడా ఇదే తరహాలో తన ఇంటి ఎదురు నివసించే మరో మహిళను కూడా హతమార్చి బంగారం అపహరించినట్లు తమ దృష్టికి వచ్చినట్లు డీఎస్పీ చెప్పారు. మూడు రోజుల్లోనే నిందితులను అరెస్టు చేసిన సీఐ ఎస్ రమేష్ బాబు, ఎస్‌ఐ షేక్ కరీముల్లా, సిబ్బంది పి. మురళి, ఎస్. జయకర్, డి. సురేష్ బాబు, కల్యాణిలను ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ చెప్పారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: కోర్టు కేసుల్లో ఉన్నవి, తమ పరిధిలో లేని వాటిపై అర్జీలు వస్తే పరిష్కారం కుదరదని అర్జీదారునికి వివరించి చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కొందరు ఒకే అర్జీపై పదే పదే వస్తున్నారని తెలిపారు. వ్యక్తిగత కక్షలు పెట్టుకుని రావద్దని హితవు పలికారు. అర్జీదారులు సిబ్బంది, అధికారులతో మర్యాదగా వ్యవహరించాలని ఆమె సూచించారు. కొన్ని అర్జీల పరిష్కారం ఇతర శాఖల సమన్వయంతో చేయాల్సి వస్తుందని, అవి కొంచెం ఆలస్యమయ్యే అవకాశముందని వెల్లడించారు. అర్జీల పరిష్కారంలో అధికారులు అవసరమైన మేరకు లీగల్ టీమ్ సహాయం తీసుకోవాలని ఆమె సూచించారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లక ముందే పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలపై అర్జీలను ప్రజలు స్థానికంగా ఉండే మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారులకు కూడా ప్రతి వారం ఇవ్వొచ్చని ఆమె సూచించారు. దీంతో ఆ సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయని చెప్పారు. అనంతరం వచ్చిన 263 అర్జీలను కలెక్టర్‌తోపాటు డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం .గంగరాజు, లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

- నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు అన్ని మండలాలలో కొనగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

బిడ్డ చదువుకు అండగా నిలవాలి !

- దివ్యాంగుడి వినతి
- దగ్గరకెళ్లి అర్జీని స్వీకరించిన సబ్‌కలెక్టర్ సంజనా సింహా



దివ్యాంగుడి నుంచి అర్జీని స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

తెనాలి: తన బిడ్డ చదువుకు సంబంధించి అర్జీని సమర్పించేందుకుని ట్రై సైకిల్‌పై కార్యాలయానికి వచ్చిన ఓ దివ్యాంగుడిని చూసిన సబ్ కలెక్టర్ వి.సంజనా సింహా స్వయంగా ఆయన దగ్గరకు వెళ్లి, సమస్య ఏమిటని ఆరా తీశారు. ఆయన చెప్పింది సావధానంగా విని అర్జీని తీసుకున్నారు. పరిశీలిస్తానని హామీనివ్వటంతో సంతోషపడ్డారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సమావేశం సందర్భంగా ఈ అంశం చోటుచేసుకుంది. పరిష్కార వేదికపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ సంజనా సింహా, వల్లభాపురంలో వివాహిత ఆత్మహత్యకు సంబంధించిన అంశంపై ప్రజాసంఘాలు ధర్నా నిర్వహించాయి. సమస్యను తెలుసుకుని వారి నుంచి అర్జీని స్వీకరించిన సబ్‌కలెక్టర్, అక్కడికి దగ్గరలోనే దివ్యాంగుడు ఒకరు ట్రైసైకిల్‌పై ఉండటాన్ని గమనించారు. దగ్గరకు వెళ్లి సమస్య ఏమిటని ప్రశ్నించారు. 'రైట్ టు ఎడ్యుకేషన్' కింద తన కుమారుడును స్థానిక ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నానని చెప్పాడు. ఒకటి, రెండు తరగతులు ఉచితంగానే విద్యను అందించిన పాఠశాల యాజమాన్యం గతేడాది 3వ తరగతికి సంబంధించి రూ.22 వేలు, ఈ విద్యాసంవత్సరం రూ.8 వేలు చెల్లించమని ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. రైట్ టు ఎడ్యుకేషన్ కింద చేర్చుకున్నారు కదాని అడిగితే ఆ ఒప్పందం గతేడాదితో రద్దయిందని చెబుతున్నారని సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. పరిశీలిస్తానని సబ్ కలెక్టర్ సంజనా సింహా హామీనిచ్చి, అర్జీని తీసుకున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

కొరెటిపాడులోని సర్వే నంబర్ 67లో కొందరు అధికార పార్టీ పేరు చెప్పుకుని కబ్జాకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు. ప్రభుత్వ భూముల్ని కాపాడాల్సిన అధికారులు మొద్దు నిద్రపోతున్నారు. కబ్జాను అరికట్టడంతోపాటు నిర్లక్ష్యం వహిస్తున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి.

–షేక్ అల్లావలి, గుంటూరు

విభజించి పాలించడం సరికాదు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్ల విధానంలో అమలు చేస్తున్న నిరంకుశ విధానాలు మారాలి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జనవరి 1, 2026 తర్వాత రిటైర్ అయిన వారికి ఒక విధంగా, దానికి ముందు రిటైరయ్యే వారికి మరో విధంగా బెనిషిట్స్ ఇస్తామని ప్రకటించడం సరి కాదు. అన్ని అధికారాలు కేంద్ర ప్రభుత్వం తన వద్దే పెట్టుకుంటాననే మొండి వైఖరిని నిరసిస్తున్నాం.

–సీహెచ్. వెంకటేశ్వర్లు, రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు

పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏవీ ?

పెదనందిపాడు నియోజకవర్గం పరిధిలో సుమారు 11 వేల ఎకరాల్లో రైతులు నల్లబర్లీ పొగాకు వేశారు. పంట చేతికొచ్చింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామన్న అధికారులు వాటిని ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. వెంటనే ఏర్పాటు చేసి, పొగాకును కొనుగోలు చేయాలి.

– పొగాకు రైతులు

ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.900 కోట్లు మంజూరు

కొరిటిపాడు (గుంటూరు వెస్ట్): స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సాధికారత లక్ష్యంగా ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం క్రెడిట్ క్యాంపును అమరావతి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఏపీలోని అమరావతి, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం, తిరుపతి జోన్లల్లోని ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.900 కోట్లను మంజూరు చేశారు. ఇండియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివ్ బజరంగ్‌సింగ్, ఫీల్డ్ జనరల్ మేనేజర్ (ఏపీ, టీజీ) ప్రణేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. శివ్ బజరంగ్‌సింగ్ మాట్లాడుతూ సమ్మిళిత ఆర్థిక వృద్ధిని ముందుకు నడిపించడంలో స్వయం సహాయక సంఘాల కీలక పాత్ర పోషిస్తాయని ప్రశంసించారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్లు ఎస్.గౌరీ శంకరరావు (అమరావతి), ఎం.రాజేష్ (విజయవాడ), అమరావతి జోన్ డెప్యూటీ జోనల్ మేనేజర్ కస్తూరి కృష్ణమోహన్, ఎం.శేషగిరిరావు పాల్గొన్నారు. వర్చువల్‌గా పలువురు జోనల్ మేనేజర్లు, డెప్యూటీ జోనల్ మేనేజర్లు హాజరయ్యారు.



స్వయం సహాయక సంఘాలకు చెక్కు అందిస్తున్న బ్యాంక్ ఉన్నతాధికారులు

టోల్‌గేట్ వద్ద గంజాయి పట్టివేత

- రూ. 3 లక్షల విలువైన మెత్ డ్రగ్ స్వాధీనం
- బెంగళూరు నుంచి వైజాగ్ వెళ్తుండగా పట్టుకున్న ఈగల్ టీమ్

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో కాజ టోల్ గేట్ వద్ద భారీగా గంజాయి, మెత్ డ్రగ్స్‌ను ఈగల్ టీమ్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. బెంగుళూరు నుంచి వైజాగ్‌కు బస్సులో వెళుతున్న యువకుడు భారీగా గంజాయి తరలిస్తున్నాడనే సమాచారం మేరకు ఈగల్ టీమ్ సోమవారం కాజ టోల్ గేట్ వద్ద నిఘా వేసింది. యువకుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి భారీ మొత్తంలో గంజాయితో పాటు రూ. 3 లక్షల విలువైన మెత్‌ను స్వాధీనం చేసుకుంది. యువకుడిని మంగళగిరి రూరల్ పోలీసులకు అప్పగించింది. గంజాయి, మెత్ అక్రమ రవాణా వెనుక ఎవరున్నారు..ఎంత మంది ఉన్నారనే ? అంశాలపై పూర్తి స్థాయిలో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొలాల్లో అస్థిపంజరం లభ్యం



తెనాలి రూరల్: పొలాల్లో అస్థిపంజరాన్ని స్థానికులు సోమవారం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. తెనాలి నుంచి బుర్రిపాలెం వెళ్లే రోడ్డులో నేలపాడు పంచాయతి పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలకు తూర్పు వైపున ఉన్న పొలంలో అస్థిపంజరాన్ని గుర్తించారు. పోలీసుల ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఎముకల గూడు పక్కన గళ్ల లుంగీ ఉంది. ఇదే పాఠశాల సమీపంలో బిచ్చగాడు నెల రోజులుగా కనబడకుండాపోయాడని, అతని అస్థిపంజరం అయి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై 'అమ్మా'నుషం

తాడేపల్లి రూరల్ : వ్యభిచారంలోకి దించిన కన్నతల్లిపై మైనర్ కూతురు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. కృష్ణాజిల్లా కూచిపూడి గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త చనిపోయిన తరువాత మరో వ్యక్తితో సహజీవనం చేస్తూ వడ్డేశ్వరం వచ్చి నివసిస్తోంది. 17 ఏళ్ల కూతురిని కూడా అతనితో ఉండాలంటూ ఒత్తిడి చేయడంతో పాటు వ్యభిచారం వృత్తిలోకి దింపింది. ఈ బాధలు భరించలేక బాలిక పక్కింట్లో నివాసముంటున్న మహిళ సాయంతో తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.



సమస్యలకు చట్ట పరిధిలో పరిష్కారం

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్


బాధితుల మొర ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ

నగరంపాలెం: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ)లో ప్రజా ఫిర్యాదులు – పరిష్కారాల వ్యవస్థ (పీజీఆర్ఎస్) ను సోమవారం నిర్వహించారు. బాధితుల నుంచి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అర్జీలు స్వీకరించారు. వారి బాధలను ఆలకించారు. ఆయా సమస్యలకు సంబంధించి పోలీస్ అధికారులతో మొబైల్‌లో మాట్లాడారు. అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంత్, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి (మహిళా పీఎస్), ఎ.శివాజీ రాజు (సీసీఎస్) కూడా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

సహచర కానిస్టేబుల్ మోసం

మంగళగిరి సబ్ డివిజన్‌లోని ట్రాఫిక్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నా. సహచర కానిస్టేబుల్ కమీషన్ల కోసం ఓ ప్రైవేటు కంపెనీ పాలసీలు చేయించాడు. వాటికి సంబంధించి నగదు చెల్లించ లేదు. ఈలోగా అతడి భార్య ఇల్లు నిర్మాణం కోసం డబ్బులు అడగ్గా, రూ.1.20 లక్షలు ఇచ్చాను. సదరు కానిస్టేబుల్ తర్వాత నా బంగారం కూడా తనఖా పెట్టుకుని డబ్బులు తీసుకున్నాడు. గతంలో ఇచ్చిన డబ్బులు అడిగితే ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. న్యాయం చేయగలరు.

– బి.అంకరాజు, ట్రాఫిక్ కానిస్టేబుల్

బెదిరిస్తున్నారు

స్థానికంగా ఇంటి వద్ద ఇద్దరు రౌడీషీటర్లు, వారి కుటుంబ సభ్యులు ఉంటున్నారు. వారిద్దరు ఏకమై, నన్ను ట్రాప్ చేశారు. బలత్కారం మినహా పనులన్నీ చేశారు. దీని ఆసరా చేసుకుని నా వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇప్పటికి రూ.40 వేలను విడతల వారీగా తీసుకున్నారు. ఆ డబ్బులు కూడా ఇంట్లో నుంచి తీసుకువచ్చి వారికి ఇచ్చా. మరలా ఇవ్వకపోతే చంపుతామని బెదిరిస్తున్నారు. నమ్మకంగా నమ్మించి నగదు కాజేశారు. రౌడీషీటర్ భార్య కూడా నన్ను బెదిరిస్తోంది. ఏదైనా చేస్తారని భయంగా ఉంది. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని కోరుతున్నా.

– ఓ బాలిక, గుంటూరు

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి

సచివాలయ ఉద్యోగుల వినతి


నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

నెహ్రూనగర్: బదిలీలపై ప్రభుత్వం ఇచ్చిన జీఓ నం.5ను సవరించాలని సచివాలయ ఉద్యోగులు విన్నవించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యాలయంలో అదనపు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెబ్ కౌన్సిలింగ్ ద్వారా పారదర్శకంగా బదిలీలు జరపాలని కోరారు. సొంత మండలాల నిబంధనను తీసివేయాలని, అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సొంత మండలాల ప్రాతిపదికగా కాకుండా అర్బన్ లోకల్ బాడీ(యుఎల్‌బీ)లోని వార్డును తీసుకోవాలని, గ్రామాల్లో పంచాయతీని ప్రాతిపదికగా తీసుకోవాలని కోరారు. ప్రమోషన్‌తో పాటు స్పష్టమైన సర్వీస్ రూల్స్‌ను రూపొందించిన తర్వాతనే బదిలీలు చేపట్టాలని విన్నవించారు. మిగులు ఉద్యోగులను సీనియారిటీ ఆధారంగా వివిధ శాఖల్లోనికి బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గుంటూరు వార్డు సచివాలయాల అసోసియేషన్ నాయకులు అబ్దుల్ రజాక్, ధనలక్ష్మి, అనురాధ, మధు, రామకృష్ణ, రాజకుమార్ పాల్గొన్నారు.

అండర్-14 టెన్నిస్ విజేత విన్సెంట్


అండర్-14 టెన్నిస్ విజేతలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, వీవీవీ హెల్త్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో సోమవారం జరిగిన అండర్-14 టెన్నిస్ పోటీల్లో మిక్స్‌డ్ సింగిల్స్ విజేతగా కె. విన్సెంట్, రన్నర్‌గా జి.దిశాంత్ నిలిచారు. డబుల్స్ విభాగంలో దిశ, విన్సెంట్ జోడీ విన్నర్‌గానూ జి.దిశాంత్, కల్యాణీలు రన్నర్స్‌గా నిలిచారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేతలకు ఆపిల్ డెంటల్ కేర్ అధినేత డాక్టర్ హనుమంతరావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వీవీవీ హెల్త్ క్లబ్ డైరెక్టర్ హరికృష్ణ, మధుస్మిత, గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, ఆనంద్ కుమార్, అరుణ్ కుమార్, చరణ్ పాల్గొన్నారు.

తెలుగు అసోసియేషన్ ఆఫ్ న్యూజిలాండ్ అధ్యక్షుడిగా బుజ్జిబాబు



గుంటూరు ఎడ్యుకేషన్ : న్యూజిలాండ్‌లో అవర్ స్టేట్ అవర్ లీడర్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం కో-ఆర్డినేటర్, వైఎస్సార్ సీపీ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న నెల్లూరి బుజ్జిబాబు ఆంధ్ర తెలుగు అసోసియేషన్ ఆఫ్ న్యూజిలాండ్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు గుంటూరుకు చెందిన ఫోరం అధ్యక్షుడు జి.శాంతమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ కన్వీనర్‌గా న్యూజిలాండ్‌లోని తెలుగువారిని సమన్వయపర్చడంతో పాటు, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. తెలుగు అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా బుజ్జిబాబుకు అభినందనలు తెలియజేశారు.

'ఫలక్‌నుమా'లో ఆరుగురు బాల కార్మికులు గుర్తింపు


బాల కార్మికులతో రైల్వే పోలీసులు

రాజుపాలెం: నడికూడి రైల్వే పోలీసు, గుంటూరు ఆర్‌పీఎఫ్, బచపన్ బచావో ఆందోళన్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా హౌరా నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో గుంటూరు నుంచి పిడుగురాళ్ల వరకు ట్రైన్‌లో రిస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఆరుగురు బాలురను గుర్తించి వారి వివరాలను సేకరించారు. వీరిని ఇతర ప్రాంతాలకు బాల కార్మికులుగా పనిచేయించేందుకు తీసుకెళుతున్నట్లు తెలిసింది. వారివారి గ్రామాలకు పంపించే వరకు మండలంలోని కొండమోడు పరిధిలో గల వీరమ్మ కాలనీలోని అనాథ పిల్లల ఆశ్రమం నిర్వాహకులు గరికపాటి శంకరరావుకు ఆదివారం రాత్రి స్థానిక ఎస్ఐ వేణుగోపాల్ సహకారంతో అప్పగించారు. ఈ బాలురు జార్ఖండ్, బీహార్, వెస్ట్ బెంగాల్‌కు చెందిన వారిగా గుర్తించారు. తల్లిదండ్రులకు అప్పగించే వారకు జాగ్రత్తగా చూసుకోవాలని ఆశ్రమ నిర్వాహకులకు సూచించారు.

యువకుడి బలవన్మరణం

చిలకలూరిపేట టౌన్: పట్టణంలోని టిడ్కో గృహాల్లో విషాదం చోటు చేసుకుంది. 52 ఎకరాల టిడ్కో గృహాల్లో నివసిస్తున్న యువకుడు దేవగిరి తేజారెడ్డి (28) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫ్యానుకు లుంగీతో ఉరివేసుకుని తన స్నేహితుడి నివాసంలో జీవితం ముగించుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తేజారెడ్డి పర్చూరు మండలం అన్నవరం గ్రామానికి చెందినవాడు. చిన్నతనంలోనే తల్లి మృతిచెందగా, తండ్రి రెండో వివాహం చేసుకుని వేరుగా నివసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో తేజారెడ్డిని నాయనమ్మ పెంచింది. అయితే కొంతకాలం కిందట ఆమె మృతిచెందడంతో అతను పూర్తిగా ఒంటరివాడయ్యాడు. పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగించిన తేజారెడ్డి మానసికంగా ఒత్తిడికి గురైనప్పుడల్లా టిడ్కో గృహంలో ఉన్న తన స్నేహితుడి వద్దకు వచ్చి ఒకటి రెండు రోజులు ఉండి వెళ్లిపోతాడు. ఆదివారం స్నేహితుడి ఇంటికి రావడంతో సాయంత్రం 4 గంటలకు మిత్రుడు పనిమీద బయటకు వెళ్లాడు. రాత్రి తిరిగి వచ్చి గది తలుపులు తీయగా తేజారెడ్డి ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు, గుంటూరు మండలం అంకిరెడ్డిపాలెంలో ఉంటున్న అమ్మమ్మకు సమాచారం అందించడంతో ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

28న తెనాలిలో మానవ హక్కుల పరిరక్షణ సదస్సు

ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు


సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): తెనాలి పోలీసుల అరాచకత్వాన్ని, మానవ హక్కుల ఉల్లంఘనను నిరసిస్తూ తెనాలి పట్టణంలో జూన్ 28న సాయంత్రం 4 గంటలకు మానవ హక్కుల పరిరక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు తెలిపారు. విజయవాడ గాంధీనగర్ ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో సోమవారం పరిరక్షణ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ తెనాలి పోలీసులు దళిత మైనారిటీ యువకులపై అక్రమ కేసులు పెట్టి పోలీస్ స్టేషన్‌లో, బహిరంగ ప్రదేశాల్లో అరికాళ్లపై లాఠీలు విరిగేటట్లుగా అమానుషంగా దాడి చేసిన సంఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన సీఐ రాముల నాయక్, తెనాలి త్రీ టౌన్ సీఐ రమేష్ బాబులతో పాటు కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. దళిత యువకులపై నడిరోడ్డుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని సమర్థించి వత్తాసు పలికిన గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మానవ హక్కుల పరిరక్షణ సదస్సులో ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి, దళిత బహుజన ఫ్రంట్, ప్రజాస్వామిక వాదులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో మాల మహానాడు అధ్యక్షుడు తుమ్మల ఫ్రాన్సిస్, కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్, రెల్లి సంఘం అధ్యక్షుడు ఎర్రంశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

సమ్మెలోకి అవుట్ సోర్సింగ్ కార్మికులు


నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు

నెహ్రూనగర్: రాష్ట్ర వ్యాప్తంగా నగరపాలక సంస్థల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విభాగ అవుట్ సోర్సింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఆదివారం రాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లారు. నగరపాలక సంస్థ కార్యాలయం ముందు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ ఈదులమూడి మధుబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు, కార్మిక సంఘాలు ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి ఈనెల 9న కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇచ్చినా స్పందించలేదని విమర్శించారు. కార్మికులకు జీతాలు పెంచమని పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని తెలిపారు. విధి లేని పరిస్థితుల్లో సమ్మె చేస్తున్నట్లు మధుబాబు తెలిపారు. గత ప్రభుత్వం పారిశుద్ధ్యం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులకు, డ్రైవర్లకు అప్పుడున్న జీతంపై రూ.6000 అదనంగా పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో పనులు చేసే కార్మికులకు కమిటీ వేసి దాని సిఫార్సు మేరకు జీతాలు పెంచుతామని హామీ ఇచ్చిందని తెలిపారు. ఈనెల రెండో తేదీన జరిగిన జాయింట్ మీటింగ్‌లో ఈ విషయాన్ని మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లగా ముఖ్యమంత్రితో మాట్లాడి చెప్తామని చెప్పి, ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదని వివరించారు. రిటైర్‌మెంటు వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని, ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు వెంటనే గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరినీ హెచ్‌ఆర్ పాలసీ పరిధిలోకి లేదా మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని కోరారు. సీనియార్టీ ప్రకారం సంవత్సరానికి ఆరు పర్సెంట్ ఇంక్రిమెంట్ ఇస్తూ జీతాలు చెల్లించాలని లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ గుంటూరు నగరపాలక సంస్థ కమిటీ ప్రధాన కార్యదర్శి రాయపూడి కోటి బాబు, కోశాధికారి నాగిపోగు సుమన్, కార్యనిర్వాహక అధ్యక్షుడు గాలి ఏసుబాబు, సంయుక్త కార్యదర్శి వేపూరి రవిశంకర్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీల్లో సీట్లకు 89 మంది విద్యార్థుల ఎంపిక


రోషిణి

గుంటూరు ఎడ్యుకేషన్: రాజీవ్‌గాంధీ సాంకేతిక, విజ్ఞాన విశ్వ విద్యాలయాల్లో (ట్రిపుల్ ఐటీ) ప్రవేశాలకు గుంటూరు జిల్లా నుంచి 89 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. 2025-26 విద్యా సంవత్సరానికి సోమవారం ప్రకటించిన జాబితాలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు ఇంటర్మీడియెట్‌తో పాటు బీటెక్‌తో ఆరేళ్ల ప్రోగ్రామ్‌కు అర్హత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 94.78 శాతం మేరకు ఉన్నట్లు ప్రవేశాల జాబితాలో పొందుపర్చారు. గుంటూరు జిల్లా నుంచి ట్రిపుల్ ఐటీల వారీగా నూజివీడు-31, ఇడుపులపాయలోని ఆర్కే వ్యాలీ- 16, ఒంగోలు-35, శ్రీకాకుళంలో-7 చొప్పున ఉన్నారు. ఎంపికైన విద్యార్థులు ఆర్‌జీయూకేటీ వెబ్‌సైట్‌తో పాటు ప్రభుత్వ వాట్సాప్ సేవల నంబరు 95523 00009 ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆయా క్యాంపస్‌లలో ఈనెల 30 నుంచి జూలై 5వ తేదీ వరకు జరగనున్న కౌన్సెలింగ్‌కు విద్యార్థులు హాజరు కావాలి.

■ గుంటూరు చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పి.నాగసాయి రోషిణి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో అత్యధికంగా 573 మార్కులు సాధించడం ద్వారా ప్రవేశం పొందిన ఆమెను డీఈవో సీవీ రేణుక, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.పద్మజ అభినందించారు.

తప్పుడు విధానాలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు ధూళిపాళ్ల రమాదేవి



సత్తెనపల్లి: ప్రజలకు సూపరిపాలన అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తప్పుడు విధానాలను అమలు చేస్తుందనిసీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు దూళిపాళ్ల రమాదేవి విమర్శించారు. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదల గ్రామంలో రమాదేవి ఆధ్వర్యంలో సీపీఎం బృందం సోమవారం పర్యటించింది. అనంతరం సత్తెనపల్లి పుతుంబాక భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగుతూనే ఉందన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే పేదలందరికీ రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇచ్చి అక్రమ రవాణా అరికట్టవచ్చునన్నారు. రేషన్ షాపుల వద్దకు వెళ్లి బియ్యం తీసుకోవాలంటే ప్రజలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇంటి వద్దకే రేషన్ బియ్యం వాహనాలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. 1 నుంచి 5 తరగతుల వరకు ఉన్న ఎలిమెంటరీ స్కూల్ నుంచి 3,4,5 తరగతులను విడదీసి దూరంగా ఉన్న హైస్కూల్‌కు తరలించడంతో పిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీల వేతనాలు 3,4 నెలల పాటు పెండింగ్‌లో పెడుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే పెండింగ్ వేతనాలు వారి అకౌంట్లో జమ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల మాట్లాడుతూ హిందూ మతాన్ని విమర్శిస్తున్న వారి సంగతి తేలుస్తానని అనడం సరికాదన్నారు. దేవుళ్లను, మతాలను రక్షించడానికి పవన్ కల్యాణ్ రాజకీయాలకు వచ్చారా? లేదా ప్రజల సమస్యలను పరిష్కరించడానికి వచ్చారా? అని ఆమె ప్రశ్నించారు. జిల్లా కమిటీ సభ్యురాలు గుంటూరు మల్లేశ్వరి, జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, పట్టణ కార్యదర్శి డి.విమల పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 1,500

మోడల్ ధర రూ. 1,300



పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 474

కొమ్ములు : 345 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,000	9,750	9,275

కాయలు : 129 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,000	9,500	9,275

మొత్తం అమ్మకాలు : 355.500 క్వింటాళ్లు

–దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	50,800
అమ్మకాలు	46,363
నిల్వ	8,689

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,200
341	10,000-13,400

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,800-13,000
నంబరు-5	10,000-13,600
341	10,000-13,500
సూపర్-10	10,000-13,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 13,800
బాడిగ-355	10,000 - 13,000
దేవనూరు డీలక్స్	10,000 - 12,800
ఆర్మూర్	9,800 - 11,200
తాలుకాయలు	5,000-7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,000
బాడిగ-355	10,000 - 13,200
తాలు	5,000 - 6,500

–కొరిటెపాడు (గుంటూరు)

రైలు నుంచి జారిపడి ప్రయాణికుడు మృతి

దాచేపల్లి: రైలు నుంచి జారిపడి ప్రయాణికుడు మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. లింగంపల్లి నుంచి నర్సాపూర్ వెళుతున్న నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి గుర్తు తెలియని ప్రయాణికుడు జారిపడి మృతి చెందినట్లు రైల్వే జీఆర్పీ పోలీసులు తెలిపారు. నర్సాపూర్ రైలు నడికుడి రైల్వే స్టేషన్‌కు చేరుకునే సమయంలో జనరల్ కోచ్‌లో ప్రయాణిస్తున్న ప్రయాణీకుడు రైలు వాకిట్లో కూర్చొని నిద్రపోతూ ప్రమాదవశాత్తూ జారి కిందపడటంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి వయస్సు సుమారుగా 25 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని, మృతుడు ఇటుక రంగు పైన ఎరుపు, తెలుపు, నలుపు చెక్స్ బారుచేతుల చొక్కా, బ్లూ రంగు జీన్స్ ప్యాంట్ ధరించాడన్నారు. మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించామని, పూర్తి వివరాలకు నడికుడి రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ వి.శ్రీనివాసరావు నాయక్ తెలిపారు. వివరాలకు 8074274484, 9949063960 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.